క్లుప్తంగా

ఘనంగా బ్రహ్మోత్సవాలు



సత్యనారాయణ స్వామి వ్రతం చేస్తున్న భక్తులు

కడ్తాల్: మండల పరిధి రావిచేడ్ గ్రామంలో ఐదు రోజులుగా శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం అర్ధరాత్రి స్వామి వారి రథోత్సవాన్ని ఆలయ పరిసరాల్లో కన్నుల పండువగా నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ధర్మకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి జన్మదిన శుభాకాంక్షలు



కవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు

కడ్తాల్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పుట్టిన రోజును పురస్కరించుకుని నగరంలోని ఆమె నివాసంలో గురువారం సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

17,18న అంగన్‌వాడీల ఆందోళన



ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

ఇబ్రహీంపట్నం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. ఈ నెల 17,18 తేదీల్లో కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు చేపట్టే ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, సీఐటీయూ నాయకులు పి.కృష్ణలు పిలుపునిచ్చారు. 48 గంటల ఆందోళన కార్యక్రమంలో పాల్గొనేందుకు అంగన్‌వాడీలకు అవకాశం ఇవ్వాలని కోరుతూ.. గురువారం ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్, మినీ టీచర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పీఎం శ్రీ పథకాన్ని, మొబైల్ అంగన్‌వాడీ సెంటర్స్‌ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ.. చేపట్టే ధర్నాకు పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీలు తరలిరావాలని కోరారు. యూనియన్ నాయకులు బేబీ, బాలమణి, లక్ష్మిలు పాల్గొన్నారు.

ఘనంగా మొల్ల జయంతి



మొల్ల విగ్రహానికి నివాళులర్పిస్తున్న కుమ్మరి సంఘం నేతలు

యాచారం: తొలి తెలుగు కవయిత్రి మొల్ల జయంతి వేడుకలను మండల కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గణేశ్, నడుకడి కృష్ణ, కొండాపురం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు కిడ్నీ పనితీరును తెలుసుకోవాలి

ఇబ్రహీంపట్నం: కిడ్నీ రోగులు ప్రతి నాలుగు నెలలకు ఒకసారి క్రియాటినిన్ టెస్ట్ చేయించుకుని, పనితీరును తెలుసుకోవాలని కోవాలని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా గురువారం ఇబ్రహీపట్నం ప్రభుత్వ ఆస్పత్రి డయాలిసిస్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధిక మోతాదులో ఉప్పు, మందులు తినడం వలన కిడ్నీ పనితీరు మందగిస్తుందని వివరించారు. అపెక్స్ కిడ్నీ కేర్ డయాలసిస్ ఇన్‌చార్జి నరేందర్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 4,500 మంది డయాలసిస్ చికిత్స పొందారని తెలిపారు. కిడ్నీలు చెడిపోయిన వారు.. వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయించుకుంటే వారి జీవన ప్రమాణం పెరుగుతుందని సూచించారు.

హోలీ.. రంగుల కేళి



పండుగకు ప్రజలు సిద్ధం

- కలర్స్ కొనుగోళ్లలో నిమగ్నం
- నేడు హోలీ ఉత్సవాలు
- సహజ రంగులే ఆరోగ్యానికి మేలు

షాబాద్: హోలీ.. రంగుల కేళి. చిన్నాపెద్ద అనే తారతమ్యం లేకుండా అందరు కలిసి ఉత్సాహంగా రంగులు చల్లుకుంటారు. హోలీని చెడుపై మంచి సాధించిన విజయంగా కూడా భావిస్తారు. ఈ రంగుల పండగను శుక్రవారం ఆనందోత్సాహాల మధ్య జరుపుకొనేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. పిల్లలు రంగులు కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు. రసాయన రంగులు వద్దని, సహజరంగులే ఆరోగ్యానికి మేలని వైద్యులు సూచిస్తున్నారు.



ఆమనగల్లులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న రంగులు

కనిపించని సహజరంగులు..

ప్రస్తుత రోజుల్లో హోలీ సంబురం అనగానే రసాయన రంగులు తెచ్చి గుప్పుకొంటున్నారు. వీటిని వాడటం ప్రమాదం అని నిపుణులు హెచ్చరిస్తున్నా.. ప్రజలు వినిపించుకోవడం లేదు. గతంలో ప్రకృతి ఒడిలో లభించే పూలతో తయారుచేసే సహజ రంగులతో హోలీ ఆడేవారు. మోదుగు, శంకు, ఎర్రమందారం, గోరింటాకు తదితర పూలు, చెట్ల ఆకులతో రంగులు తయారు చేసేవారు. పూలు, ఆకులు ఎండబెట్టి వేడి నీళ్లలో నానబెట్టి రంగులు సిద్ధం చేసేవారు. వీటిని ఒంటిపై చల్లుకున్నా ఎలాంటి హాని ఉండేది కాదు. ఇంతకు ముందు పల్లెల్లో మోదుగు పూలతో తయారుచేసిన రంగుకు ప్రాధాన్యం ఇచ్చేవారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఈత రాకుండా నీటిలోకి దిగరాదు.
- చెరువులోతు తెలియకుండా ఈత కొట్టడం, నీటిలో విన్యాసాలు చేయడం మంచిది కాదు.
- ఈత వచ్చినా ఎక్కువ సమయం నీటిలో ఉండొద్దు.
- మద్యం సేవించిన తర్వాత ఈత కొట్టకపోవడమే మేలు.
- రసాయన రంగులను చెరువులు, కుంటల్లో కడుక్కోవడంతో నీటి కాలుష్యం జరుగుతుంది.

సూచనలు..

- హోలీ ఆడడానికి ముందు ముఖానికి మాయిశ్చరైజర్, తలకు నూనె రాసుకోవడం ఉత్తమం.
- ఎరుపు రంగు కోసం బీట్‌రూట్, మోదుగు పూలు, గులాబీ, మందారం వాడాలి.
- పసుపు రంగు కోసం పసుపు, ఆకుపచ్చ రంగు కోసం ఆకుకూరల మిశ్రమం వాడొచ్చు.
- సహజ రంగుల్లో లభించే యాంటియాక్సిడెంట్లు చర్మవ్యాధులను నియంత్రించి, చర్మాన్ని మృదువు చేస్తాయి.

కృత్రిమ రంగులతో ఇబ్బందులు..

- నలుపులో లెడ్ ఆక్సైడ్ మూత్రపిండాల వైఫల్యాలకు దారితీస్తుంది.
- కృత్రిమ ఆకుపచ్చ రంగుతో కాపర్ సల్ఫేట్ కంటి దురద, వాపు వైఫల్యాలకు దారితీస్తుంది.
- వెండి రంగు అల్యూమినియం బ్రోమైడ్ క్యాన్సర్‌కు కారకం.
- నీలి రంగు పుసియన్‌బ్ల్యూ చర్మ సంబంధ వ్యాధులు, మెర్క్యూరీ సల్ఫేట్ (ఎరుపు) కేన్సర్‌కు కారణమవుతాయి.
- పౌడర్లు, గులాల్, లెడ్, బ్రోమియం, నికెల్, మెర్క్యూరీ, కాపర్, జింక్‌లతో వినిడికి లోపం, ఎలర్జీ, ఆయాసం మొదలగు దుష్పలితాలకు దారితీస్తాయి.

మార్పునకు కృషి చేయాలి



హోలీ పండుగను పురస్కరించుకొని తమ గ్రామంలో ప్రతీ సంవత్సరం ప్రజల్లో మార్పు కోసం కృషి చేస్తున్నాం. సహజసిద్ధ రంగులను వాడుకోవాలి. రసాయన రంగులు కళ్లలో పడితే చూపు దెబ్బతింటుంది. ప్రకృతిలో లభించే పూలు, ఆకులు, ఇతరత్రా వాటితో తయారయ్యే రంగులను వినియోగించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. తద్వారా పర్యావరణాన్ని కూడా కాపాడినట్టే అవుతుంది.

–గంగిడి భూపాల్‌రెడ్డి, హైతాబాద్

రసాయన రంగులు వాడొద్దు



పండగ సందడిలో కెమికల్స్ కలిపిన కలర్లను వాడితే ప్రమాదం తెచ్చుకున్నట్టే. రంగుల నుంచి వచ్చే పొగ పీల్చుకోవడంతో ఊపిరితిత్తుల సమస్యలతో పాటు శ్వాస సంబంధిత వ్యాధులతో ఇబ్బంది తప్పవు. రంగులు కంటిలో పడితే శాశ్వత అంధకారం రావొచ్చు. స్కిన్ ఎలర్జీకి సైతం గురవుతారు. సహజసిద్ధ రంగులతో ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– డాక్టర్ విజయలక్ష్మి, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, షాబాద్

ప్రాణాలతో చెలగాటం వద్దు



రంగుల పండగ పూర్తయిన తర్వాత చాలా మంది యువకులు, పెద్దలు స్నానం చేసేందుకు చెరువులు, బావులు, జలాశయాల వద్దకు వెళ్తుంటారు. అలాకాకుండా ఇంటివద్దనే రంగులను కడుక్కోవడం ఉత్తమం. చెరువులు, బావుల వద్దకు వెళ్లి, ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు.

– కాంతారెడ్డి, సీఐ, షాబాద్

నిరుపేదలకు వసతులు కల్పించండి



చలివేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు

హయత్‌నగర్: ప్రభుత్వ భూమిలో ఏళ్ల తరబడి గుడిసెలు వేసుకుని జీవిస్తున్న వేలాది మంది పేదలకు కనీస వసతులు కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి డిమాండ్ చేశారు. గురువారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధి రావినారాయణరెడ్డి కాలనీ ఫేజ్‌-3లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సుదీర్ఘ కాలంగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలు.. తాగునీరు, విద్యుత్, రోడ్డు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వారికి తగిన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని సూచించారు. ఈ సందర్భంగా గడిసెల వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన రమేష్‌నాయక్, ప్రియ కవితలను ఆయన అభినందించారు. ఇది కాలనీ వాసులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడి శేఖర్‌రెడ్డి, నాయకులు హరిసింగ్‌నాయక్, లక్ష్మణ్, నర్సింహ్మా, అరుణ, వట్టి నవనీత, దాసరి ప్రసాద్, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ బడిలో అన్నీ సమస్యలే



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదర్శ బడిలో అన్నీ సమస్యలేనని బీజేపీ రాష్ట్ర నాయకుడు బోసుపల్లి ప్రతాప్ అన్నారు. గురువారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి బొంగ్లూర్‌లోని ఆదర్శ పాఠశాలను ఆ పార్టీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వం అని గొప్పగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీ.. సమాజాన్ని తీర్చిదిద్దే విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడం సిగ్గు చేటన్నారు. వెంటనే తాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ కో కన్వీనర్ నారాయణ యాదవ్, దళితమోర్చా రాష్ట్ర కార్యదర్శి బచ్చిగళ్ల రమేష్, జిల్లా మీడియా కన్వీనర్ అశోక్‌గౌడ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సీనియర్ నాయకుడు రవిచంద్ర పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఎంఈఓ, ఉపాధ్యాయులు

ఎంఈఓ సత్యనారాయణ

కడ్తాల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈఓ సత్యనారాయణ అన్నారు. ఇటీవల సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్మాణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో కడ్తాల్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. మే నెలలో ఢిల్లీలో జరగనున్న వాలీబాల్ జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన తరుణ్, ఉదయ్, సాయి, నాని, కిరణ్, శశివర్ధన్‌లను ఎంఈఓతో పాటు పీఈటీ భీముడు, హెచ్‌ఎం జంగయ్య అభినందించారు. పాఠశాలకు, మండలానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చినందుకు హర్షం వ్యక్తంచేశారు. దేశ రాజధాని ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్, శ్వేత, ఇంద్రారెడ్డి, కౌసల్య, భాగ్యలక్ష్మి, శోభారాణి, బుచ్చమ్మ, సునీత, భాగ్యమ్మ, గీతాబాయి, స్రవంతి, శంకర్‌నాయక్, మల్లయ్య, తిరుపతి, ప్రవీణ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, రహీం, పాషా, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

‘ఉపాధి’ కూలీల సంఖ్య పెంచండి

ఎంపీడీఓ కుసుమమాధురి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఆమనగల్లు: ఉపాధిహామీ పథకం పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ కుసుమమాధురి అన్నారు. మండల పరిధి రాంనుంతల గ్రామంలో ఈజీఎస్ పథకంలో భాగంగా చేపట్టిన పనులను గురువారం ఆమె పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఆమనగల్లు మండలంలోని 11 గ్రామాల్లో జరుగుతున్న పనుల్లో 1,022 మంది కూలీలు పాల్గొంటున్నారని తెలిపారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో గుర్తించిన పనులను చేపడుతున్నామని, కూలీలు ఎక్కువగా వచ్చేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. కూలీలు ఉదయాన్నే వచ్చి మధ్యాహ్నం వరకు పనులు చేపట్టాలని, వేసవి నేపథ్యంలో పని ప్రదేశంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ లాలునాయక్, గ్రామ కార్యదర్శి బాలమల్లేశ్ పాల్గొన్నారు.

మండల సాధనే లక్ష్యంగా పోరాటం

- గట్టుప్పలపల్లి మండల సాధన జేఏసీ నాయకులు
- చలో అసెంబ్లీని భగ్నం చేసిన పోలీసులు



తలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లో గట్టుప్పలపల్లి నాయకులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం గట్టుప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని సుదీర్ఘ కాలంగా పోరాడుతున్నా.. ప్రభుత్వాలు గుర్తించడం లేదని మండల సాధన జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజల ఆకాంక్షను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మండలం సాధించే వరకు ఉద్యమం ఆపేది లేదని స్పష్టంచేశారు. మండల సాధనే లక్ష్యంగా గురువారం జేఏసీ చలో అసెంబ్లీ పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

2020 నుంచి..

గట్టుప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ 2020లో 39 రోజులు, 2023లో వంద రోజులు గ్రామస్తులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ప్రస్తుతం జేఏసీ మండల సాధన సమితి ఆధ్వర్యంలో 147 రోజులుగా దీక్ష కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 13న చలో అసెంబ్లీకి పిలుపునిచ్చారు. దీంతో తలకొండపల్లి పోలీసులు ముందస్తుగా జేఏసీ నాయకులు అశోక్‌గౌడ్, మాజీ సర్పంచ్ వెంకటయ్య, దుబ్బ చెన్నయ్య, పవన్, ఏదుల మహేశ్, శరత్‌చంద్రలను అరెస్టు చేశారు. ఆమనగల్లు ఠాణాకు తరలించారు. అనంతరం తమ నాయకులను విడిచి పెట్టాలని డిమాండ్ చేస్తూ గట్టుప్పలపల్లిలో ఆందోళన చేస్తున్న పలువురు నాయకులను పోలీసులు అరెస్టు చేసి కడ్తాల్, తలకొండపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆమనగల్లు పోలీసు స్టేషన్‌లో జేఏసీ నాయకులను కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పరామర్శించి, సంఘీభావం తెలిపారు. గట్టుప్పలపల్లిని మండల కేంద్రంగా చేయాలని గతంలో తాను ప్రయత్నించానని జైపాల్‌యాదవ్ గుర్తుచేశారు. మండల సాధనకు పూర్తి మద్దతు తెలుపుతున్నానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, బీఆర్‌ఎస్ ఆమనగల్లు అధ్యక్షుడు పత్యానాయక్, నాయకులు వెంకటేశ్, రమేశ్‌లు ఉన్నారు.

ఘనంగా ముందస్తు హోలీ



మేడిగడ్డతండా ప్రభుత్వ పాఠశాలలో హోలీ సందడి

ఆమనగల్లు: హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రంగుల విక్రయాల దుకాణాలు కొనుగోలు దారులతో కిటకిటలాడాయి. శుక్రవారం ప్రభుత్వ సెలవు దినంగా.. గురువారం పాఠశాలలు తదితర కార్యాలయాల్లో ముందస్తు హోలీ సంబురాలు జరుపుకొన్నారు. మండల పరిధి మేడిగడ్డ తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంబురాలు చేసుకున్నారు. వేడుకలో హెచ్‌ఎం స్వప్నారెడ్డి, ఉపాధ్యాయురాలు సంతోషిణి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు గోపాలచార్యులు, రామాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకం, స్వస్తివాచనం, అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు.

సీసీరోడ్డు పనులు..



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న అజీం

ఆమనగల్లు: తలకొండపల్లి మండల కేంద్రంలో గురువారం సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీం ప్రారంభించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన నిధులతో రోడ్డు నిర్మిస్తున్నామని అజీం తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి రవీందర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణ, పెంటయ్య, రామ్మోహన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, గోపాల్, రమేశ్, పాండు, నర్సింహ, మల్లేశ్, శ్రీనివాస్, గణేశ్, శేఖర్, పురుషోత్తం, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించకుంటే సౌకర్యాలు కట్

- మొండి బకాయిదారులపై కఠినంగా వ్యవహరించాలి
- మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్



మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రసాగర్

ఇబ్రహీంపట్నం: ఆస్తి పన్ను చెల్లించని పక్షంలో సౌకర్యాలను నిలిపివేయాలని కమిషనర్ రవీంద్రసాగర్ ఆదేశించారు. మొండి బకాయిదారులపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 31వ తేదీ లోపు వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని సూచించారు. పన్ను చెల్లించకుంటే మున్సిపల్ నుంచి కల్పించే తాగునీటి, డ్రైనేజీ కనెక్షన్లను కట్ చేయాలని ఆదేశించారు. గత సంవత్సరం రూ.4.50 కోట్ల పన్ను వసూలు చేశామని, ఈసారి 12 శాతం అదనంగా వసూలు చేస్తేనే 15వ ఫైనాన్స్ నిధులు మంజూరు అవుతాయని పేర్కొన్నారు. నెలాఖరులోగా రూ.1.50 కోట్ల రాబడితేనే.. లక్ష్యం చేరుకుంటామని వెల్లడించారు. సుమారు రూ.5 కోట్లు మొండి బకాయిలున్నాయని స్పష్టంచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్వో శివలింగం, పర్యావరణ ఇంజినీర్ ప్రణవ్‌లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

- తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి
- ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

యాచారం: ప్రజా సమస్యలపై ఏ మాత్రం నిర్లక్ష్యం చేయరాదని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో తాగునీటి సమస్య రాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్నతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 18 నుంచి 35 ఏళ్ల వయసున్న మహిళలకు గ్రామాల్లో ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ ఇస్తున్నారని, ఆసక్తి కలిగిన వారు సద్వినియోగం చేసుకునే విధంగా మహిళలకు అవగాహన కల్పించాలని చెప్పారు. వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఉపాధి పనులను వేగవంతం చేయాలని, ప్రతి కూలి ఉపాధి పనులకు వచ్చేలా చూడాలని ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. మండల పంచాయతీ అధికారి శ్రీలత, ఈజీఎస్ ఏపీఓ లింగయ్య ఉన్నారు.

ఫ్యూచర్‌సిటీ అథారిటీలో కలపండి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి, కలెక్టర్‌కు మొండిగౌరెల్లి గ్రామస్తుల విన్నపం



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు



కలెక్టర్ నారాయణరెడ్డికి..

యాచారం: ఫ్యూచర్‌సిటీ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో మొండిగౌరెల్లి గ్రామాన్ని కలపాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. యాచారం మండల కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాన్ని యూడీఏలో కలిపి అభివృద్ధి చేయాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మండల పరిధి మొండిగౌరెల్లి, మంతన్‌గౌరెల్లి, మంతన్‌గౌడ్ రెవెన్యూ గ్రామాలను ఫ్యూచర్‌సిటీలో కలిపే విధంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పర్యవేక్షణ అధికారి దానకిషోర్‌కు లేఖ రాశానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు బుచ్చిరెడ్డి, యాదగిరిరెడ్డి, మర్పల్లి అంజయ్య యాదవ్, తాండ్ర రవీందర్, నక్క శ్రీనివాస్ యాదవ్, వల్లంల బుచ్చిరెడ్డి, మాధం జంగయ్య, సందీప్‌రెడ్డి, వెంకటేశ్, గుర్రం జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి నివేదిక పంపుతా

మొండిగౌరెల్లి, మంతన్‌గౌరెల్లి, మంతన్‌గౌడ్ రెవెన్యూ గ్రామాలను ఫ్యూచర్‌సిటీలో కలపాలని ఆయా గ్రామాల ప్రజలు గురువారం కొంగలకాలన్‌లోని కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. యాచారం మండల పరిధి అన్ని గ్రామాలను అథారిటీలోకి తీసుకుని, మూడు రెవెన్యూ గ్రామాలను వదిలిపెట్టడం సరికాదని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన కలెక్టర్.. ప్రభుత్వానికి నివేదిక పంపి అథారిటీలో కలిపేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో తాండ్ర రవీందర్, కొర్ర అరవింద్‌నాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.